నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 30 మార్చి 2025 | KAMAREDDY





రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ కుల సంఘాల నాయకులు

## కామారెడ్డి డిక్లరేషన్
# ఏమైంది?

### వంద శాతం అమలు చేయాల్సిందే

- అప్పటిదాకా సర్కారును వెంటాడుతాం
- బీసీలకు న్యాయం చేసింది కేసీఆరే..
- బలహీన వర్గాల మేలు కోసమే బీసీ ఉద్యమం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడి
- బీసీ కుల సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం
- బీసీ బంధు కవిత అంటూ కీర్తించిన నేతలు

'పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో బీసీలకు ఎంతో న్యాయం జరిగింది. సంక్షేమ బడ్జెట్‌లో 70 శాతం బీసీలకే కేటాయించిండ్రు. కేసీఆర్ ఆనాడు కుల వృత్తులను బలోపేతం చేస్తుంటే కొంత మంది ఎగతాళి చేస్తూ మాట్లాడిండ్రు. ఇప్పుడు గత 15 నెలల నుంచి కుల వృత్తులు ఏ విధంగా కుదేలయ్యాయో చూస్తున్నాం. ఇప్పుడు ఒక్కరూ మాట్లాడరెందుకు?'

'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఏ ఒక్క సీటును కూడా బీసీ వర్గానికి ఇవ్వలేదు. కానీ ఇదే కామారెడ్డి గడ్డపై బీసీ డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఆనాడే ప్రజలను వంచించింది.'

– ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కామారెడ్డి : వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచింది కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీయేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీలకు ఎంతో న్యాయం జరిగిందన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలను నమ్మించి మోసగించిందని మండిపడ్డారు. బీసీ డిక్లరేషన్‌ను నూరు శాతం అమలు చేసేదాకా రేవంత్ సర్కారును వెంటాడుతామని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో కామారెడ్డిలో బీసీ కుల సంఘాలతో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత ప్రసంగించారు. బీసీలకు న్యాయం చేసే వరకూ ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

### కేసీఆర్‌తోనే బీసీలకు న్యాయం..

కేసీఆర్ హయాంలో బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం దక్కిందని కవిత తెలిపారు. ఓయూకు తొలిసారి బీసీ బిడ్డను వీసీగా చేసింది కేసీఆరే అని, తెలుగు రాష్ట్రాల్లోనే మొదటిసారిగి బీసీని అడ్వకేట్ జనరల్‌గా పెట్టింది కేసీఆరే అని గుర్తుచేశారు. నాడు సబ్బండ వర్ణాలను కలుపుకుని పోయామని, అదే ఒరవడి కొనసాగాలని ఈరోజు కొట్లాడుతున్నామన్నారు. రాజకీయం, విద్య, ఉద్యోగపరంగా రిజర్వేషన్లు రావాలని, ఇందుకోసం మూడు బిల్లులు పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏమైంది?

కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52 శాతం అని తేలిందని కవిత తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో బీసీల జనాభాను తగ్గించి ఓసీల జనాభాను పెంచారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కేవలం రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ తమ పోరాటం వల్ల దిగివచ్చిన ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ చట్టాలు చేసిందన్నారు. ఎంబీసీ కులాలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంత వరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర సభలు ఆమోదించిన బీసీ బిల్లుల స్థితిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లులు గవర్నర్ వద్ద ఉన్నాయా? లేక రాష్ట్రపతికి పంపించారా? చెప్పాలన్నారు. తెలంగాణ చట్ట సభలు పాస్ చేసిన బీసీ బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా కులాల వారీగా జనాభా లెక్కలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

### బీసీ బంధు కవితక్క..

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ కులాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత చేస్తున్న బీసీ రిజర్వేషన్ పోరాటంపై ప్రశంసల జల్లు కురిపించారు. కవిత పోరాటంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో రెండు వేర్వేరు బిల్లులు పెట్టిందన్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ కృషితోనే ఇదంతా జరిగిందన్నారు. బీసీల పక్షాన పోరాటం చేసిన ఎమ్మెల్సీ కవిత పేరు చిరస్థాయిగా చరిత్రలో నిలుస్తుందని వ్యాఖ్యానించారు. బీసీ పోరాటంపై కృతజ్ఞతగా ఓ వక్త విన్నపం మేరకు సభికులంతా లేచి నిలబడి చప్పట్లతో కవితకు కృతజ్ఞతలు తెలిపారు. కుల గణనలో బీసీల సంఖ్య తక్కువగా చూపెట్టినప్పటికీ బీసీ సంఘాలు, యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి వంటి సంస్థల ఒత్తిడి, ఉద్యమంతోనే బీసీ రిజర్వేషన్ అంశం కొలిక్కి వచ్చిందన్నారు. కేసీఆర్ హయాంలో బీసీలకు జరిగిన మేలును పలువురు గుర్తు చేశారు. కుల వృత్తుల వారికి అందించిన ప్రోత్సాహాలను గొల్ల, కురమలు, గౌడ్, మత్స్యకార సామాజిక వర్గాలకు చెందిన వారు కొనియాడారు. శివశంకర్ ప్రారంభోపన్యాసం చేశారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, ప్రతినిధులు బాజిరెడ్డి జగన్, సుమిత్రానంద్, అయాచితం శ్రీధర్, నవీనాచారి, సంపత్‌గౌడ్, నరాల సుధాకర్, విజయేందర్, కాసాని వీరేశ్, భాస్కర్ యాదవ్, జుబేర్, నరేశ్, మారయ్య, సాంబారి మోహన్, కొట్టాల యాదగిరి, సురేందర్, వీరన్న, కుమారస్వామి, సాల్వాచారి, గోపి సదానందం, శ్రవణ్, మంజుల, బాజ లలిత, అశోక్ యాదవ్, బాలన్న, లింగం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితకు నిలబడి చప్పట్లతో కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ కుల సంఘాల నాయకులు

### కవిత పోరాటం అభినందనీయం..



బీసీ సమాజం అన్యాయానికి గురవుతున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న పోరాటం అభినందనీయం. 33 జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు పెట్టి మన హక్కుల కోసం కొట్లాడుతున్న ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు. తెలంగాణ ఉద్యమ సమయంలో, బతుకమ్మ కనుమరుగవుతున్న రోజుల్లో ముందుండి పోరాడారు. ఇప్పుడు బీసీల కోసం చేస్తున్న మీ పోరాటం వృథా కాదు.

- జాజాల సురేందర్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే

### మా గళానికి బలాన్ని ఇస్తున్నారు



బీసీ కులాల తరుపున కవిత మా గళానికి బలాన్ని ఇస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ అనేక ఉద్యమాలను చేపట్టిన ఘనత కవితక్కది. క్షేత్ర స్థాయి నుంచి కష్టపడే వారు మాత్రమే ఈ బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లగలరు. బీసీల కోసం కొట్లాడుతున్న బలహీన వర్గాలన్నీ మీ వెంటే ఉన్నాయి.

- బాజిరెడ్డి జగన్, మాజీ జడ్పీటీసీ, ధర్పల్లి

### అబద్ధాలతో అధికారంలోకి..



అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కామారెడ్డి వేదికగా బీసీలకు అనేక హామీలు ఇచ్చింది. వాటిని అమలు చేయలేక చేతులెత్తేసింది. 42 శాతం స్థానిక సంస్థల్లో అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ మాట ఇచ్చింది. బీసీ జన గణన ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలి.

- సుమిత్రానంద్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు

### బీసీల అభ్యున్నతి కోసమే ఉద్యమం



గతంలో బీసీల కోసం పోరాడిన నాయకుడు ఎవరు లేరు. కానీ ఎమ్మెల్సీ కవిత ఒక్కరే బీసీల పక్షాన కొట్లాడుతున్నారు. మండలిలో బీసీల హక్కుల కోసం ప్రభుత్వంపై పోరాటం చేశారు. బీసీలు బాగు పడాలని, బీసీల అభ్యున్నతి కోసం ఆమె చేస్తున్న ఉద్యమానికి సబ్బండ వర్గాలు అండగా ఉంటాయి.

- సంపత్ గౌడ్, జాగృతి నాయకుడు

### బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం..



బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటాన్ని ముందుగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నాం. 70 కుల సంఘాలతో ఎమ్మెల్సీ కవిత చర్చించారు. వారందరినీ ఏకతాటిపైకి తెచ్చి ముందుకు నడిపించిన వ్యక్తి కవిత. ఆమె పోరాటానికి బీసీల పూర్తి మద్దతు ఉంటుంది.

- శివశంకర్, యునైటెడ్ పూలే ఫ్రంట్ కో-కన్వీనర్



## జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు





మోర్తాడ్/ఆర్మూర్‌టౌన్/వినాయక్‌నగర్/కంఠేశ్వర్, మార్చి 29: జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంలో అంతా మంచే జరగాలని, ప్రజలందరి జీవితాల్లో ఆశలు చిగురించాలని, ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, రైతులతో పాటు అన్ని రంగాల్లో ప్రజలు అభివృద్ధిలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ సాయి చైతన్య జిల్లావాసులకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ, పండుగను ప్రజలంతా ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.



## కట్టుకున్నోడిని కడతేర్చిన ఇల్లాలు

- ప్రియుడితో కలిసి ఘాతుకం
- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నం
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



అమృతం విఠల్ (ఫైల్)

బాన్సువాడ రూరల్, మార్చి 29 : ప్రియుడి మోజులో పడిన ఓ ఇల్లాలు కట్టుకున్న భర్తనే కడతేర్చిన ఘటన బాన్సువాడ మండలం నాగారంలో చోటు చేసుకుంది. బాన్సువాడ సీఐ అశోక్ కేసు వివరాలను శనివారం వెల్లడించారు. నాగారం గ్రామానికి చెందిన అమృతం కాశమణితో సోమేశ్వర్ గ్రామానికి చెందిన బింగి అలియాస్ అమృతం విఠల్ (38)తో ఇరవై ఏండ్ల క్రితం వివాహం జరిగింది. అతను నాగారం గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. కాశమణి దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే, కుటుంబంలో గొడవలతో భార్యభర్తలు ఐదేండ్ల నుంచి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో కాశమణి అదే గ్రామానికి చెందిన అమృతం విఠల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయంపై గతంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. అయినప్పటికీ ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. మరోవైపు, తన వివాహేతర సంబంధాన్ని భర్త తరచూ ప్రశ్నిస్తుండడంతో కాశమణి అతడ్ని అడ్డు తొలగించుకోవాలనుకున్నది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తన ప్రియుడు విఠల్, మరో వ్యక్తితో కలిసి భర్త గొంతు నులిమి, కొట్టి హత్య చేశారు. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు కొల్లూర్ గ్రామ శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై మృతదేహాన్ని పడేశారు. అయితే, తన తమ్ముడి మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి సోదరుడు బింగి సాయిలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించిన పోలీసులు.. నిందితులైన కాశమణి, విఠల్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.



క్యాసంపల్లి తండాలో ఎండిన వరి పంట

## తగ్గిన భూగర్భ జలాలు..
# రైతన్నకు సాగునీటి కష్టాలు

- బోరుబావుల్లో పడిపోయిన నీటి నిల్వలు
- వట్టిపోతున్న బోర్లు.. ఎండుతున్న పంటలు
- సమావేశాలకే పరిమితం అవుతున్న అధికారులు

కామారెడ్డి, మార్చి 29 : రోజురోజుకూ భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఎన్నో ఆశలతో వేసిన పంటలకు సరిగా నీరందక రైతు కండ్ల ముందే ఎండిపోతున్నాయి. సరిపడా కరెంటు ఉన్నా.. బోరు బావుల్లో నీరు లేక రైతులు కన్నీరు పెట్టాల్సి వస్తున్నది. తమ గ్రామానికి చెరువులు, కుంటలు లేవని.. బోరు బావులపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నామని కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి తండావాసులు తెలిపారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండడంతో బోరు బావుల్లో నుంచి నీళ్లు రావడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 24 గంటల కరెంటు ఉండేదని, చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు ఉండడంతో భూగర్భ జలాలకు ఢోకా ఉండేది కాదన్నారు. జిల్లా కేంద్రంలో అధికారులు కేవలం మొక్కుబడిగా సాగు నీటి సమస్యపై సమావేశాలు నిర్వహిస్తున్నారే తప్ప, క్షేత్ర స్థాయిలో సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అప్పు తెచ్చి పంట సాగుచేశా..

ఉన్న బోరుపై ఆధారపడి నాకున్న రెండెకరాల్లో వరి పంట వేశా. పెట్టుబడి కోసం సుమారు రూ.60వేల వరకు ఖర్చు చేశా. ప్రస్తుతం బోరులో నుంచి చుక్క నీరు రావడం లేదు. ప్రస్తుతం పంట ఎండుతున్నది. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. పెట్టుబడితోపాటు పంట నష్టపోవడంతో రూ.రెండు లక్షల వరకు అప్పు అయ్యే పరిస్థితి నెలకొన్నది. మా తండాలో రైతులందరి పరిస్థితి ఇలాగే ఉన్నది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలి.



భుక్యా గణేశ్, క్యాసంపల్లి తండా

### భానుడి ప్రతాపం.. వంతెన కింద ఉపశమనం



భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో జనాలతోపాటు జీవాలు కూడా అల్లాడుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు ఓ కాపరి సోమార్‌పేట్ తండాలోని వంతెన కింద పశువులను తాళ్లతో కట్టేయడంతో అవి చల్లని నీడన సేదతీరాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కామారెడ్డి

## గణిత ప్రశ్నల లీకేజ్ కేసులో
# మరొకరి అరెస్టు

కామారెడ్డి, మార్చి 29 : జుక్కల్‌లో పదో తరగతి గణిత పరీక్ష ప్రశ్నలను లీక్ చేసిన కేసులో మరో నిందితుడ్ని పోలీసులు శనివారం అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. గత బుధవారం జుక్కల్‌లోని పరీక్షా కేంద్రం నుంచి గణిత ప్రశ్నలు లీక్ చేసిన కేసులో ఇప్పటికే ఎనిమిది మందిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో మరో నిందితుడు నయీమ్ ఖాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇకపై ఎవరైనా ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులకు ఇబ్బంది కలిగేలా, ఒక వర్గాన్ని కించపరిచేలా ఉన్న వీడియోలు, ఫొటోలు పోస్టులు చేసినా, వాటిని ఇతరులకు పంపించినా వారితో పాటు ఆ గ్రూప్ అడ్మిన్‌పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చట్ట పరిమితులకు లోబడి సోషల్ మీడియాను వినియోగించాలి తప్పితే చట్ట వ్యతిరేకంగా ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా ఎవరైనా ప్రయత్నిస్తే చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




